

ఎన్నికల ఫిర్యాదులకు కంట్రోల్ రూమ్

● సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల ఫిర్యాదులు, సందేహాల నివృత్తికి సంగారెడ్డి కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ ప్రావిణ్య మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. ఎన్నికలపై ఫిర్యాదులు, సందేహాలు ఉంటే కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్ 08455-276155, హెల్ప్ డెస్క్ ఫోన్ నంబర్ 8125352721 ద్వారా సంప్రదించాలని పేర్కొన్నారు.

ఓటర్.. క్వార్టర్..!

సంగ్రామంలో కీలకంగా మద్యం

- జిల్లాలో పెరిగిన బెల్ట్‌షాపులు
- ఇప్పటికే దావత్‌ల జోరు
- కొత్త వ్యాపారులకు కిక్
- ఎక్సైజ్ కనుసన్నల్లో దందా



మెదక్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్ ఎన్నికల వాతావరణం వేడెక్కుతోంది. ఇప్పటికే మొదటి, రెండో విడత నామినేషన్ల ఘట్టం పూర్తయ్యింది. ఎన్నికల్లో పోటీ చేయాలనుకున్న అభ్యర్థులూ తమ లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. గెలుపో.. ఓటమో అన్న చందంగా సర్వశక్తులు ఒడ్డేందుకు సిద్ధమయ్యారు. ప్రచారానికి పదును పెడుతూనే.. ఓటర్లను మంచి చేసుకునే ప్రయత్నాల్లో ఉన్నారు. ఇందుకు గ్రామాల్లో ఓటర్- క్వార్టర్ వ్యూహాన్ని అమలు చేస్తున్నారు.

జోరందుకున్న దావత్‌లు..

ఎన్నికలతో గ్రామాలు కళకళలాడుతున్నాయి. ఎక్కడెక్కడో ఉన్న వారంతా గ్రామాలకు రావడం.. ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధపడటం.. ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు దావత్‌లు ఏర్పాటు చేయడంతో సందడి నెలకొంది. ఓ పక్క చర్చలు జరుపుతూనే సాయంత్రం అయితే చాలు ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు మందు, మటన్, చికెన్‌లతో విందు ఇస్తున్నారు. కుల సంఘాలు, సామాజిక వర్గాల వారీగా ఈ విందులు సాగుతున్నాయి. యూత్‌కు ఓ చోట.. పెద్దలకు మరో చోట.. ఓ స్థాయి ఉన్న నాయకులకు ఇంకో చోట ఇలా వారికి తగినట్లుగా మందు, మాంసం వంటివి ఏర్పాటు చేస్తున్నారు.

ఊరికి రెండు మూడు బెల్ట్‌షాపులు

దీంతో మద్యం షాపు యజమానులు బల్క్‌స్టాక్ తెప్పిస్తున్నారు. మరో పక్క మూత బడిన బెల్ట్‌షాపులు మళ్లీ తెరుచుకుంటున్నాయి. ఒక్కో గ్రామంలో రెండు నుంచి మూడు వరకు బెల్ట్‌షాపులు నడుస్తున్నాయి. కిరాణా షాపుల్లోనూ మద్యం అందుబాటులో ఉంటోంది. అభ్యర్థులు సైతం వ్యాపారులకు ముందస్తు చెల్లింపులు చేసి స్టాక్ తీసుకువచ్చి గ్రామాల్లో డంప్ చేస్తున్నారు. వైన్స్ యజమానులు సిండికేట్‌గా మారి.. బెల్ట్‌షాపులకు మద్యం సరఫరా చేస్తున్నారు.

కొత్త వ్యాపారుల జోష్..

కొత్త మద్యం దుకాణాలు ప్రారంభంలోనే మంచి బోణి కొడుతున్నాయి. వాస్తవానికి మద్యం షాపులకు భారీగానే గిరాకీ ఉండగా, ఎన్నికల నేపథ్యంలో మరింత పెరిగింది. కొన్ని వైన్స్‌లలో ఒకే వ్యక్తి పేరుతో 30- 40 కేసుల మద్యం కొనుగోళ్లు జరుగుతున్నాయి. మెదక్ జిల్లాలో ప్రస్తుతం 49 వైన్స్ షాపులులతో పాటు 16 బార్ షాపుల ద్వారా మద్యం విక్రయాలు కొనసాగుతున్నాయి. ఈ నెల 1 నుంచే కొత్త దుకాణాలు ప్రారంభం కాగా, గిరాకీ చూసి కొత్తగా ఈ వ్యాపారంలోకి వచ్చిన వారు ఉబ్బితబ్బిబవుతున్నారు. ఇలాగే గిరాకీ ఉంటే తమ పెట్టుబడులతో పాటు భారీగా లాభాలు ఉంటాయన్న ఆశతో ఉన్నారు. పాత వ్యాపారులు మాత్రం ఇది ఎన్నికల గిరాకీగా సరిపెట్టుకుంటున్నారు. రానున్న రోజుల్లో వరుసగా ఎన్నికలు వస్తుండటంతో మద్యం వ్యాపారుల్లో జోష్ మరింత పెరిగింది.

పట్టించుకోని ఎక్సైజ్ శాఖ

గ్రామాల్లో బెల్ట్‌షాపుల జోరు పెరుగుతున్నా ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదు సరికదా.. తమ టార్గెట్ పూర్తవుతుందన్న ఆనందంలో ఉన్నారు. కొన్ని గ్రామాల్లో

- మిగతా 10వ పేజీలో...



నర్సాపూర్ ఇసుక బజార్‌లో నిల్వ ఉన్న ఇసుక

ప్రైవేటు నిర్మాణాలకూ ఇసుక

- 'ఇసుక బజార్' నుంచి విక్రయానికి నిర్ణయం
- రూ.1600కే టన్ను.. త్వరలో విధివిధానాలు

నర్సాపూర్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఇసుక బజార్ నుంచి ఇప్పటివరకు ఇందిరమ్మ ఇళ్లకే పంపిణీ చేసిన ఇసుకను ఇక నుంచి ప్రైవేటు నిర్మాణాలకూ విక్రయించనున్నారు. ప్రభుత్వం నుంచి తక్కువ ధరకు నాణ్యమైన ఇసకను అందుబాటులోకి తేవాలనే ఉద్దేశంతో ప్రతి నియోజకవర్గ కేంద్రంలో ఇసుక బజార్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా నర్సాపూర్‌లోని మార్కెట్ యార్డులో ఇప్పటికే ప్రారంభించారు. మొదటగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు కేవలం రూ.1200లకు టన్ను చొప్పున సరఫరాచేశారు. ఇసుక బజార్‌కు లబ్ధిదారుల నుంచి మంచి స్పందన వస్తుండటంతో ప్రైవేటు వారికి కూడా విక్రయించాలని ఉన్నతధికారుల నుంచి ఆదేశాలు వచ్చినట్లు ఇక్కడి నిర్వాహకులు తెలిపారు. ఒకటిరెండు రోజులలో ఈ ప్రక్రియ ప్రారంభమవుతుందని వారు పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు టన్నుకు రూ.1200 చొప్పున తీసుకోగా, ప్రైవేటు నిర్మాణాలకు మాత్రం టన్ను ఇసుకను రూ.1600లకు విక్రయించనున్నట్లు చెప్పారు. ఇంకా పూర్తిస్థాయి నియమనిబంధనలు రాలేదని, అవి రాగానే ఇసుక బజార్ నుంచి ప్రైవేటు నిర్మాణాలకు కూడా ఇసుక సరఫరా చేస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు. ప్రస్తుతం బయట వ్యక్తుల నుంచి ఇసుక కొనుగోలుకు టన్నుకు రూ.3వేల నుంచి రూ.5వేలకు వరకు వెచ్చించాల్సి వస్తున్నది. అదికూడా నాణ్యతలేకుండా ఉండడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇసుక బజార్ నుంచి ప్రైవేటు వారికి విక్రయం ప్రారంభిస్తే మంచి డిమాండు లభించే అవకాశం ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు.

నామినేషన్ బారులు



పీచేర్యగడిలో నామినేషన్ కేంద్రం వద్ద అభ్యర్థుల బారులు

రెండవ విడత నామినేషన్ల స్వీకరణ ముగిసింది. మంగళవారం చివరి రోజు నామినేషన్ కేంద్రాలకు అభ్యర్థులు పోటెత్తారు. 5 గంటల లోపు కేంద్రాలకు చేరినవారు బారులు తీరి మరీ నామినేషన్లు దాఖలు చేశారు. కొన్ని కేంద్రాల్లో అర్ధరాత్రి వరకూ ప్రక్రియ కొనసాగింది. అభ్యర్థులు భారీ ఊరేగింపు మధ్య నామినేషన్ కేంద్రాలకు తరలివచ్చారు.



చేగుంటలో ఓ అభ్యర్థి నామినేషన్ సందర్భంగా భారీ ర్యాలీ

- చివరి రోజు భారీగా దాఖలు
- సందడిగా నామినేషన్ కేంద్రాలు
- అర్ధరాత్రి వరకు కొనసాగిన ప్రక్రియ
- నేటి నుంచి మూడో విడత షురూ
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

మెదక్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పంచాయితీ ఎన్నికలకు సంబంధించి రెండవ విడత నామినేషన్లకు చివరి రోజు మంగళవారం భారీ సంఖ్యలో నామినేషన్లు దాఖలాయ్యాయి. అభ్యర్థులు పెద్ద ఎత్తున నామినేషన్ కేంద్రాలకు తరలిరావడతో సందడి కనిపించింది. వందలాది మంది కార్యకర్తలు, అభిమానుల ఊరేగింపు మధ్య అభ్యర్థులు నామినేషన్ కేంద్రాలకు చేరుకున్నారు. సాయంత్రం 5 గంటల తర్వాత కూడా అభ్యర్థులు కేంద్రంలో పెద్ద ఎత్తున బారులు తీరి కనిపించారు. సోమవారం చిన్నశంకరంపేట మండలంలోని నామినేషన్ కౌంటర్లలోనే తెల్లవారుజామా వరకూ ఉండిపోవాల్సి వచ్చింది. రామాయంపేట మండలంలో 16 సర్పంచ్ స్థానాలకు మొత్తం 126 మంది అభ్యర్థులు, 138 వార్డులకు 325 మంది నామినేషన్లు వేశారు. మనోహరాబాద్‌లో 17 సర్పంచ్ స్థానాలకు 131 మంది, 148 వార్డులకు 527 మంది దరఖాస్తులు చేసుకున్నారు. నార్సింగిలో 9 సర్పంచ్ స్థానాలకు 34 మంది, 65 వార్డులకు 112 మంది నామినేషన్లు వేశారు. తూప్రాన్‌లో 14 సర్పంచ్ స్థానాలకు 76 మంది, 114 వార్డులకు 300 మంది నామినేషన్లు వేశారు. చిన్న శంకరంపేటలో 31 సర్పంచ్ స్థానాలకు 185 మంది, 292 వార్డులకు 682 మంది నామినేషన్లు వేశారు. మెదక్, నిజాంపేట, చేగుంట మండలాల్లో రాత్రి వరకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగింది.

నేటి నుంచి మూడో విడత..

నేటి నుంచి మూడు రోజుల పాటు మూడో విడత నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కానున్నది. మెదక్ జిల్లాలోని నర్సాపూర్, చిలప్‌చేడ్, కొల్చారం, కౌడిపల్లి, శివంపేట, వెల్దుర్తి, మాసాయిపేట మండలాల్లోని 183 గ్రామ పంచాయితీలు, 1528 వార్డులకు నామినేషన్లను స్వీకరించనున్నారు. అందు కోసం అధికారులు సర్వం సిద్ధం చేశారు. నామినేషన్ కేంద్రం నుంచి వంద మీటర్ల పరిధిలో గుంపులుగా అనుమతులు నిషేధించినట్లు అధికారులు ఆదేశాలు జారీ చేశారు. సాయంత్రం ఐదు గంటలు దాటితే నామినేషన్ కేంద్రం ప్రధాన ద్వారాలు మూసివేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశాలున్నాయి.

నేడు మొదటి విడత నామినేషన్ల ఉపసంహరణ...

జిల్లాలో తొలి విడత సర్పంచ్ ఎన్నికల అభ్యర్థుల నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ బుధవారం నిర్వహించనున్నారు. తొలి విడతలో మెదక్ జిల్లాలోని అల్లాదుర్గం, రేగోడ్, పెద్ద శంకరంపేట, టేక్మాల్, పాపన్నపేట, హవేలీఘనపూర్ మండలాల పరిధిలో నామినేషన్లు స్వీకరించారు. 160 గ్రామ సర్పంచ్ స్థానాలకు 678 మంది, 1402 వార్డు సభ్యుల స్థానాలకు 2819 అభ్యరుథలు నామినేషన్లు దాఖలు చేశారు. అనంతరం 30 వ తేదిన నామినేషన్ల పరిశీలన, డిసెంబరు 1న అభ్యంతరాల స్వీకరణ జరిగింది. నేడు ఎన్నికల ప్రక్రియలో

- మిగతా 10వ పేజీలో...

సంగారెడ్డి జిల్లాలో

సంగారెడ్డిటౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలోనూ చివరి రోజు అర్ధరాత్రి వరకు నామినేషన్ల దాఖలు కొనసాగింది. రెండో విడతలో అందోలు-జోగిపేట రెవెన్యూ డివిజన్ పరిధిలోని నాలుగు మండలాలు, జహీరాబాద్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఐదు మండలాలు, సంగారెడ్డి రెవెన్యూ డివిజన్ పరిధిలోని మునిపల్లి మండలంలోని గ్రామాలకు ఎన్నికలు జరుగనున్నాయి. రెండవ విడత జిల్లాలోని 243 గ్రామ పంచాయతీలకు, 2164 వార్డులకు డిసెంబరు 14వ తేదీన ఎన్నికలు జరుగనున్న విషయం తెలిసిందే..

రెండో విడత మండలాల వారిగా నామినేషన్ల వివరాలు..

మండలం	సర్పంచులు	నామినేషన్లు	వార్డులు	నామినేషన్లు
అందోల్	25	161	224	548
చౌటకూరు	15	144	134	371
పుల్కల్	19	106	172	408
వట్‌పల్లి	22	138	190	557
రాయికోడ్	32	187	270	507
ఝరాసంగం	33	156	288	545
జహీరాబాద్	22	163	210	580
మొగుడంపల్లి	22	152	200	456
కోహీర్	23	152	214	546
మునిపల్లి	30	169	262	561
మొత్తం	243	1528	2164	5079

ఎన్నికల సంఘం ఆదేశాలను పాటించాలి

● మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

కొల్చారం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. మూడో విడతలో కొల్చారం మండలంలోని సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు జరిగే నామినేషన్ స్వీకరణ ప్రక్రియకి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ మేరకు మంగళవారం కొల్చారం ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించారు. 7 మండలాలకు సంబంధించిన 183 గ్రామపంచాయతీలు, 1528 వార్డులకు నామినేషన్లు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఈ నెల 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు నామినేషన్ ప్రక్రియ జరుగనున్నదని తెలిపారు. సాయంత్రం 5 గంటలకు నామినేషన్ కేంద్రం గేటు మూసివేయాలని, అంతలోపు నామినేషన్ కేంద్రంలో ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, అభ్యర్థుల ప్రకటన, గుర్తుల కేటాయింపులో జాగ్రత్తగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్ రెడ్డి, తాసిల్దార్ శ్రీనివాసాచారి, ఎంపీడీవో , రిటర్నింగ్ అధికారులు, రెవిన్యూ సిబ్బంది ఉన్నారు.



మంచు దుప్పటి

చలి తీవ్రత పెరగడంతో అదే స్థాయిలో పొగ మంచు కూడా కురుస్తున్నది. ఉదయం 8 గంటలు దాటిన గ్రామాలను మంచు వీడడంలేదు. మండల కేంద్రమైన శివ్వంపేటలో మంగళవారం ఉదయం దట్టమైన పొగమంచు రోడ్డును కప్పేసింది. ఎదురుగా వచ్చే వాహనాలు సైతం కనబడలేదు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

- శివ్వంపేట, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి)

ఓటు లేక.. బరి చేజారె..

- సతీమణిని బరిలో నిలిపేందుకు బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడి ప్రయత్నం
- ఓటరు కార్డు ఉన్నా.. జాబితాలో పేరులేకపోవడంతో నిరాశ

నర్సాపూర్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): తన స్వగ్రామానికి సేవ చేయాలనే ఉద్దేశంతో సర్పంచ్‌గా తన సతీమణిని బరిలో దించాలని అనుకున్నాడు బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్. తీరా ఓటరు జాబితాలో ఆమె పేరు లేకపోవడంతో అకవాశం చేజారినట్లయింది. వివరాల్లోకి వెళ్లితే బీజేపీ జిల్లా అధ్యక్షుడు వి.మల్లేశ్‌గౌడ్ స్వగ్రామమైన నర్సాపూర్ మండలంలోని గొల్లపల్లి సర్పంచ్ స్థానానికి అన్‌రిజర్వుడు మహిళకు వచ్చింది. దీంతో ఆయన తన భార్య రాధను బీజేపీ మద్దతుతో బరిలో దించాలని అనుకున్నారు. ఈ మేరకు మంగళవారం మండల పరిషత్‌కు వెళ్లి ఓటరు జాబితాను తనిఖీ చేయగా పేరు కనిపించలేదు. ఓటరు కార్డు ఉన్నా.. జాబితాలో పేరు లేకపోవడంపై అక్కడి అధికారులను ప్రశ్నించారు. గత జూన్ లోపు ఓటరుగా దరఖాస్తు చేసుకున్నవారికి మాత్రమే ఈ జాబితాలో పేర్లు వచ్చాయని.. ఆ తరువాత వారివి రాలేదని అధికారులు తెలిపారు. ఓటరు జాబితాలో పేరుంటే నామినేషన్ వేసే అవకాశం ఉంటుందని అధికారులు స్పష్టం చేయడంతో వారు నిరాశతో వెనుదిరిగారు.

అత్తమామల వేధింపులకు తల్లీకుమారుడు బలి

- రెండేళ్ల కొడుకును చంపి.. తానూ ఆత్మహత్య
- భర్త ఆరు నెలల క్రితమే మృతి

8లో

పస్తాపూర్‌లో వ్యక్తి హత్య

8లో

భార్యను చంపి.. భర్త ఆత్మహత్య

8లో

రెండు గ్రామపంచాయతీలు ఏకగ్రీవం..!

- కుసునూరు సర్పంచ్‌గా రాజశేఖర్‌గౌడ్
- సర్పంచ్‌తండా ఏకగ్రీవానికి తీర్మానం

రాయికోడ్ /కల్హేర్/సిర్గాపూర్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండల పరిధిలోని కుసునూరు గ్రామ ఎన్నిక ఏకగ్రీవమైంది. మంగళవారం గ్రామస్థులంతా రాజశేఖర్‌గౌడ్‌ను సర్పంచ్‌గా ఎన్నుకున్నారు. రాజశేఖర్‌తోపాటు 8 వార్డుల సభ్యులు ఒక్కొక్కటి చొప్పున నామినేషన్లను దాఖలు చేయగా, గ్రామ అభివృద్ధి కోసం వారందరినీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపసర్పంచ్‌గా జయపాల్‌రెడ్డిని ఎన్నుకున్నారు. రాజశేఖర్‌గౌడ్‌ను గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. గ్రామస్తులందరికీ ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సర్పంచ్‌తండా సర్పంచ్‌గా బాబునాయక్

సిర్గాపూర్ మండల పరిధిలోని సర్పంచ్‌తండా గ్రామ పంచాయితీ ఎన్నిక ఏకగ్రీవం కోసం తీర్మానం చేసినట్లు తండావాసులు తెలిపారు. మంగళవారం గ్రామ సభ ఏర్పాటు చేసుకుని స్థానికుడు బాబునాయక్‌ను సర్పంచ్‌గా, రాజునాయక్‌ను ఉప సర్పంచ్‌గా ఎన్నుకోవడానికి తీర్మానించినట్లు తెలిపారు.

సర్పంచ్ అభ్యర్థి భూ విరాళం

కౌడిపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మూడో విడత నామినేషన్ ప్రారంభం కాక ముందే మండలంలోని పలుతండాల్లో వేలం నిర్వహిస్తున్నారు. కుషాన్‌గడ్డతండా సర్పంచ్‌కు కోసం స్థానికుడు రాజు 5 గుంటల భూమిని తండా పంచాయతీ కార్యాలయ భవనం కోసం ఇచ్చేందుకు ఒప్పుకున్నాడు. అలాగే ధర్మసాగర్‌గేట్‌తండాలో రూ.7లక్షలు, వీర్ల తండాలో రూ.10 లక్షల సొంత నిధులు గ్రామాల అభివృద్ధికి వెచ్చిస్తామంటూ సర్పంచ్ ఏకగ్రీవ ఎన్నిక కోసం కొందరు ఒప్పందం చేసుకున్నారు. వేలం, భూ విరాళాల ద్వారా పదవి చేపట్టవద్దని తెలిసినా ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. దీనిపై అధికారులు చర్యలు తీసుకుంటారో లేదో చూడాలి.



ఏకగ్రీవమైన కుసునూరు గ్రామ పాలకవర్గం

విత్తన బిల్లుపై అభిప్రాయ సేకరణ

● మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్ అర్బన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): కొత్త విత్తన బిల్లు-2025 ముసాయిదాపై రైతులు, విత్తన వ్యాపారులు, ఉత్పత్తిదారులు, నర్సరీల యజమానులు, ఇతర వాటాదారుల నుంచి అభ్రిపాయలను సేకరించినట్లు మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో నూతన విత్తన బిల్లు-2025 ముసాయిదాపై జిల్లా స్థాయి సంప్రదింపుల సమావేశం నిర్వహించారు. కొత్త విత్తన బిల్లులోని సెక్షన్లు, క్లాసుల, విత్తనచట్టం 1966లోని లోపాలు, నూతన చట్టం లక్ష్యం గురించి చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించడం, వ్యాపారులకు లాభం చేకూరే విధంగా చట్టాల రూపకల్పన ఉంటుందన్నారు. కల్తీ విత్తనాల విక్రయాలు లేకుండా విత్తన ఉత్పత్తిదారులు నాణ్యమైన విత్తలను అందించాలన్నారు. లైసెన్స్ కలిగిన డీలర్ల ద్వారా మాత్రమే కొనుగోలు చేయాలని రైతులకు సూచించారు. విత్తన చట్టంపై అవగాహన కల్పిస్తూ.. క్షేత్రస్థాయిలో సమర్థవంతమైన సలహాలను స్వీకరించి, కేంద్ర వ్యవసాయ శాఖ వెబ్‌సైట్‌లో ఈ నెల 11లోపు వారి సూచనలను, సలహాలను పొందుపర్చాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, డీఏవో దేవకుమార్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రతాప్‌సింగ్, ఇరిగేషన్ ఈఈ శ్రీనివాసరావు, అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

భార్యను చంపి.. భర్త ఆత్మహత్య

టేక్మాల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కట్టుకున్న భార్యను దారుణంగా హతమార్చి.. ఆపై అతను ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మెదక్ జిల్లా టేక్మాల్‌లో చోటు చేసుకుంది. ఇద్దరూ కలిసి పడుకున్న సమయంలో దిండుతో ఆమె ముఖంపై అదిమిపెట్టి చంపేసి.. తర్వాత తను దూలానికి ఉరి వేసుకున్నట్లు అక్కడి పరిస్థితులు ఉన్నాయి. మండలంలోని బర్దిపూర్ గ్రామానికి చెందిన గంగారాం


శ్రీశైలం, మంజుల(ఫైల్)

శ్రీశైలం(37), గంగారాం మంజుల (34) భార్యాభర్తలు. వీరికి ఇంటర్ చదివే కుమారుడు ఉన్నాడు. అతనికి షుగర్ ఉండటంతో రోజూ డయాలసిస్ చేయాల్సిన పరిస్థితి. ఊర్లో ఉన్న ఎనిమిది ఎకరాల భూమిని కౌలుకు ఇచ్చి.. కుమారుడి వైద్యం కోసం శ్రీశైలం, మంజుల దంపతులు హైదరాబాద్ వెళ్లారు. అక్కడ కుమారుడికి వైద్యం చేయిస్తూ కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. దసరా సందర్భంగా గ్రామానికి వచ్చి ఇక్కడే ఉంటున్నారు. ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరిగేవని ఇరుగుపొరుగు వారు చెప్పారు. మంజుల పుట్టిల్లు అయిన మండలంలో అసద్‌మహ్మద్‌పల్లి వెళ్లింది. భర్త వేధింపులపై పోలీసులను ఆశ్రయించింది. ఇరువర్గాల పెద్దలు కూర్చొని నచ్చజెప్పడంతో ఆమె మళ్లీ భర్తతో వచ్చింది. కుమారుడు మాత్రం అమ్మమ్మ వద్ద ఉంటున్నాడు. సోమవారం రాత్రి భార్యభర్తలు నిద్రించారు. మంగళవారం ఉదయం శ్రీశైలం సోదరుడు వచ్చి చూడగా ఒకరు నిద్రలోనే చనిపోయినట్లుగా, మరొకరు దూలానికి ఉరి వేసుకుని కనిపించారు. దగ్గరికి వెళ్లి చూడగా, అప్పటికే ఇద్దరూ చనిపోయి ఉన్నారు. విషయం తెలుసుకున్న అల్లాదుర్గం సీఐ రేణుక, టేక్మాల్ పోలీసులు వచ్చి వివరాలు సేకరించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. హైదరాబాద్‌లో ఉంటున్న క్రమంలో భార్యకు వివాహేతర సంబంధం ఏర్పడిందని భర్త అనుమానించి.. ఇంటికి తీసుకవచ్చాడని, ఈ క్రమంలోనే ఈ ఘటన జరిగిందని భావిస్తున్నారు.

ఉత్కంఠగా సాగుతున్న క్రికెట్ లీగ్ మ్యాచ్‌లు


విజయం సాధించిన సంగారెడ్డి బి జట్టు

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి మెదక్ జిల్లా నిర్వహిస్తున్న అండర్-14 ఇంట్రా డిస్ట్రిక్ట్ క్రికెట్ లీగ్ మ్యాచ్‌లు ఉత్కంఠగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం బీపీఆర్ సింగాపూరం క్రికెట్ మైదానంలో సంగారెడ్డి ఎ జట్టు, సిద్దిపేట పింక్ జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన సిద్దిపేట పింక్ జట్టు 31.2 ఓవర్లలో 89 పరుగులు చేసి ఆలౌట్ అయింది. అనంతరం సంగారెడ్డి ఎ జట్టు 17.2 ఓవర్లలో 91 పరుగుల చేసి విజయం సాధించింది. కాగా రెండో లీగ్ మ్యాచ్ ఎస్‌వీఎం గగన్‌గ్రౌండ్‌లో సిద్దిపేట ఆరెంజ్, సంగారెడ్డి బి జట్ల మధ్య జరిగాయి. మొదట బ్యాటింగ్ చేసిన సంగారెడ్డి బి జట్టు 49.4 ఓవర్లలో 274 పరుగులు చేసి ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్ చేసిన సిద్దిపేట ఆరెంజ్ జట్టు 44.5 ఓవర్లలో 151 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో 124 పరుగులతో సంగారెడ్డి బి జట్టు విజయం సాధించింది.

బెల్టుషాపులపై పోలీసుల దాడులు

రేగోడు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): బెల్టు షాపులపై పోలీసులు దాడులు నిర్వహించారు. మంగళవారం మండలంలోని వెంకటాపురం గ్రామంలో ఓ హోటల్లో తనిఖీ చేయగా 6.60 లీటర్ల మద్యం లభించింది, దీని విలువ రూ 3750 ఉంటుందని ఎస్ఐ పోచయ్య తెలిపారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మద్యం నిల్వ ఉంచిన, బెల్టు షాపులు నిర్వహించిన కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మద్యం నిలువలపై ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రూ 50 వేలకు మించి తీసుకెళ్లద్దని సూచించారు.

అత్తమామల వేధింపులకు తల్లీకుమారుడు బలి

- రెండేళ్ల కొడుకును చంపి.. తానూ ఆత్మహత్య
- భర్త ఆరు నెలల క్రితమే మృతి

చిన్నశంకరంపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : అత్తమామల వేధింపులకు తల్లికుమారుడు బలయ్యారు. రెండేళ్ల తన కొడుకును ఊపిరాడకుండా చేసి చంపిన తల్లి.. తరువాత తానూ ఆత్మహత్య చేసుకున్నది. ఈ హృదయ విదారకమైన ఘటన మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలంలోని ఖాజాపూర్‌లో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఖాజాపూర్ గ్రామానికి చెందిన తాళ్ల ప్రవీణ్‌గౌడ్‌తో నార్సింగి మండలం సంకాపూర్ గ్రామానికి చెందిన అఖిల(23)కు నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి కుమారుడు రియాన్స్‌గౌడ్(2) సంతానం. ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించే ప్రవీణ్‌గౌడ్ ఆరునెలల క్రితం అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. అప్పటినుంచి అఖిలకు అత్తమామలతో నిత్యం గొడవలు జరుగుతున్నాయి. కుమారుడిని ఇక్కడే వదిలి తల్లిగారింటికి వెళ్లిపోవాలని వేధింపులకు గురిచేశారు. దీంతో మనస్తాపానికి గురైన అఖిల ఇంట్లో ఎవరూ లేని సమయంలో తలుపులు మూసి గడియ వేసుకుని కుమారుడికి ఊపిరాడకండా చేసి చంపేసింది.


కొడుకు రియాన్స్‌గౌడ్‌తో అఖిల

అనంతరం ఆమె చున్నీతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబీకులు తలుపులు బాదినా తీయకపోవడంతో గడియను పగలగొట్టి ఇంట్లోకి వెళ్లగానే తల్లికుమారుడు విగత జీవులుగా కనిపించారు. సమాచారం అందుకున్న రామాయంపేట సీఐ వెంకటరాజాగౌడ్ ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. అత్తమామలే చంపేశారని అఖిల బంధువులు ఆరోపిస్తూ ఆందోళనకు దిగారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

భూమి లాక్కోవడం అన్యాయం


తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న చిన్నకంజర్ల రైతులు

పటాన్‌చెరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : దశాబ్దాల కాలంగా భూమిని నమ్ముకొని జీవిస్తున్న తమను అన్యాయం చేయడానికి అధికారులు పూనుకున్నారని రైతులు చెప్పారు. మంగళవారం ఇంద్రేశం మున్సిపల్ పరిధి చిన్నకంజర్ల గ్రామ రైతులు పటాన్‌చెరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేసి మాట్లాడారు. గ్రామంలోని 187 ఎకరాల భూమిని బలవంతంగా లాక్కోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారని వివరించారు. ఇప్పటికే ఆర్డీవో ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించి అభిప్రాయాలు తీసుకున్నారని అన్నారు. దీనిపై ప్రభుత్వం ఆలోచన చేసి మాభూమి మావద్దే ఉంచేటట్లు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గాయత్రీ, గణపతిరాజు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఉద్యోగి ఆత్మహత్య


రాంబాబు

రామచంద్రాపురం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందులతో ప్రైవేట్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్న ఘటన కొల్లూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ రమేశ్ కథనం ప్రకారం... నగరంలోని కర్మన్‌ఘాట్‌కు చెందిన రాంబాబు(41) భార్య, ముగ్గురు పిల్లలతో కలిసి ఉస్మాన్‌నగర్ సైబర్ కాలనీలో నివాసముంటూ నిర్మాణ సంస్థలో పనిచేస్తున్నారు. సోమవారం రాత్రి రాంబాబు ఇంట్లోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆర్థిక ఇబ్బందులతోనే రాంబాబు ఆత్మహత్యకు పాల్పడినట్టు ఎస్ఐ రమేశ్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు

రాంనగర్‌లో తాళం వేసిన ఇంట్లో చోరీ

- రూ.2.50 లక్షల అపహరణ
- గజ్వేల్ ఏసీపీ విచారణ


రాంనగర్‌లో విచారణ జరుపుతున్న గజ్వేల్ ఏసీపీ నర్సింలు

జగదేవ్‌పూర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జగదేవ్‌పూర్ మండలంలోని రాంనగర్‌లో తాళం వేసి ఉన్న ఇంట్లో గుర్తు తెలియని యువకులు ఇంట్లోకి చొరబడి రూ.2.50 లక్షల నగదును అపహరించారు. గ్రామానికి చెందిన కోట రామచంద్రం కుటుంబీకులు ఇంటికి తాళం వేసి కొమురవెల్లి మండలం పోసాన్‌పల్లి గ్రామానికి బంధువుల ఇంటికి సోమవారం రాత్రి వెళ్లారు. మంగళవారం ఉదయం తిరిగొచ్చి చూసేసరికి బీరువా తాళం తెరిచి ఉండడంతో గమనించిన పరిశీలించగా.. బీరువాలో ఉంచిన రూ.2.50 లక్షల నగదు అపహరణకు గురైందని గుర్తించారు. స్థానికులు, కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గజ్వేల్ ఏసీపీ నరసింహులు, రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్ఐ కృష్ణారెడ్డి సంఘటనా స్థలానికి చే రుకుని క్లూస్ టీంతో విచారణ చేపట్టారు. కాగా బీరువాలో బంగారు ఆభరణాలు ఉన్నా నగదు మాత్రమే చోరీ కావడంపై అనుమానాలకు తావిస్తున్నట్లు కుటుంబీకులు తెలిపారు.

పస్తాపూర్‌లో వ్యక్తి హత్య


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

జహీరాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి హత్యకు గురైన సంఘటన జహీరాబాద్ మండలంలోని పస్తాపూర్ గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ వినయ్‌కుమార్ కథనం ప్రకారం.. ఝరాసంగం మండలంలోని గంగాపూర్ గ్రామానికి చెందిన మహబూబ్(30) ఆర్టీసీలో అవుట్ సోర్సింగ్‌లో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. మంగళవారం ఇంట్లో డ్యూటీకి వెళ్తున్నానని చెప్పి వెళ్లాడు. తర్వాత జహీరాబాద్ పట్టణంలోని పస్తాపూర్ సమీపంలో గల శ్మశాన వాటిక వద్ద శవమై కన్పించాడు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పట్టణ సీఐ శివలింగం సంఘటన స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ వివరించారు. హత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

పరిహారం ఇవ్వనిదే రోడ్డు వేయొద్దు

- పనులను అడ్డుకున్న రైతులు


అధికారులతో వాగ్వాదం చేస్తున్న బాధిత రైతులు

రామచంద్రాపురం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పరిహారం ఇవ్వనిదే తమ భూముల నుంచి రోడ్డు వేయొద్దంటూ బాధిత రైతులు మంగళవారం అధికారులతో వాగ్వాదానికి దిగారు. తెల్లాపూర్‌లోని మే ఫేయర్ విల్లాల నుంచి ఉస్మాన్‌నగర్, గోపన్‌పల్లి రోడ్డు వరకు రోడ్డు వేయడానికి అధికారులు కాంట్రాక్టర్‌తో సహా వచ్చారు. అక్కడున్న రైతులు భూమిని ఇవ్వడానికి నిరాకరించారు. అయినా కాంట్రాక్టర్ రోడ్డు వేయడానికి ప్రయత్నించడంతో వాగ్వాదానికి దిగారు. రైతుల సమస్యను పరిష్కరించి రోడ్డు వేయాలని మాజీ కౌన్సిలర్ కంజర్ల శ్రీశైలం తెలిపారు. ఈ రోడ్డును ఓ బిల్డర్ కోసం వేస్తున్నారంటూ రైతులు డాకరెడ్డి రవీందర్‌రెడ్డి, ఆవుల మురళీయాదవ్, కంజర్ల కుమార్, కంజర్ల మల్లేశ్, ఆవుల లక్ష్మయ్యయాదవ్, ఆవుల గణేష్‌యాదవ్ తదితరులు ఆరోపించారు.

వాహన తనిఖీల్లో రూ.30 లక్షలు పట్టివేత

చేగుంట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా చేగుంట మండలం మక్క రాజుపేట శివారు పోలీసులు చేపట్టిన వాహన తనిఖీల్లో రూ. 30,59,500 నగదు పట్టుబడింది. చేగుంట ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి కథనం ప్రకారం.. ఎన్నికల నేపథ్యంలో మంగళవారం మండలంలోని మక్కరాజు పేట వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. గజ్వేల్ మండలం దాచారంకు చెందిన గుండెల్లి యాదగిరి, శిరీషలు బైక్‌పై వెళ్తుండగా, ఆపి తనిఖీ చేశారు. బ్యాగులో రూ. 30,59,500 లభించాయి. సదరు నగదుకు సరైన ఆధారాలు చూపలేకపోవడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు.

నాణ్యమైన విద్యనందించాలి

- సంగారెడ్డి డీఈవో వెంకటేశ్వర్లు


సంగారెడ్డి పోతిరెడ్డిపల్లి ఏపీహెచ్‌బీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో వెంకటేశ్వర్లు

సంగారెడ్డి అర్బన్/చేగుంట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి);: విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని సంగారెడ్డి డీఈవో వెంకటేశ్వర్లు సూచించారు. సంగారెడ్డి పోతిరెడ్డిపల్లి ఏబీహెచ్‌బీ కాలనీలోని ఎంపీపీఎస్ పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న బోధనపై ఆరా తీశారు. పాఠశాల రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం లక్ష్మణ్, టీచర్ వందన తదితరులు ఉన్నారు. స్వచ్ఛంద సంస్థ ద్వారా విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించడం చాలా సంతోషమని జిల్లా విద్యాధికారి విజయ పేర్కొన్నారు. మంగళవారం చేగుంట మండల పరిధిలోని చందాయపేట పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరవ తరగతి నుంచొ పదవ తరగతి వరకు గణితశాస్త్ర ఉపాధ్యాయుడు శ్రీనివాస్ సహకారంతో చావలి లక్ష్మీసుబ్రహ్మణ్యం ఫౌండేషన్ ఆధ్వర్యంలో 51 మంది విద్యార్థులకు రూ.43, 350 అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్య ప్రధానోపాధ్యాయులు విట్టల్ రెడ్డి, కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు వెంకటరామిరెడ్డి, జిల్లా తపస్ ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్, ఉపాధ్యాయులు నర్సింలు, సలీం, వీణ, రాములు, గిర్ధర్ ,స్వప్న శ్రీనివాస్ బంగారయ్య, సౌజన్య దామోదర్ ,యాదగిరి, తదితరులు విద్యార్థులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలపై సర్కార్ నిర్లక్ష్యం

- టీయూడబ్ల్యూజే ఐజేయూ కమిటీ

సంగారెడ్డి రూరల్ డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నదని టీయూడబ్ల్యూజే ఐజేయూ నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు టీయూడబ్ల్యూజే ఐజేయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఏకే ఫైసల్, జిల్లా అధ్యక్షుడు యాదగిరి, జిల్లా ప్రధాన కార్యదర్శి విష్ణుప్రసాద్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అనిల్, ఆసిఫ్ మంగళవారం ఓ సంయుక్త ప్రకటనలో రాష్ట్రప్రభుత్వ తీరును ఎండగట్టారు. రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న వైఖరికి నిరసనగా ఈ నెల 3న హైదరాబాద్‌లో నిర్వహించే మహాధర్నాకు జర్నలిస్టులు భారీగా తరలి రావాలని ఆయన కోరారు. జర్నలిస్టులకు అక్రిడిటేషన్‌కార్డులు, ఇళ్లస్థలాలు తదితర సమస్యలను పట్టించుకోని ప్రభుత్వానికి సమష్టిగా బుద్ధి చెప్పేందుకు జర్నలిస్టులు సిద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు.



తూప్రాన్ మండలం కిష్టాపూర్ నుంచి వచ్చిన, చెట్లకింద కూర్చున్న మహిళలు

రోజంతా పడిగాపులు

తూప్రాన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నామినేషన్ కోసం వచ్చిన మహిళలు రోజంతా చెట్ల కింద పడిగాపులు కాశారు. కిష్టాపూర్‌కు చెందిన ఓ సర్పంచ్ అభ్యర్థి నామినేషన్ వేసేందుకు మహిళలను పెద్దఎత్తున తీసుకువచ్చాడు. మహిళలు భారీగా రావడంతో నామినేషన్ రావడానికి అనుమతించలేదు. పోలీసుల బారీకేడ్ల ప్రదేశంలో కూర్చోవడానికి అవకాశం లేకపోవడంతో ఇబ్బందులుపడ్డారు. అక్కడే ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లే మట్టి రోడ్డులో కిందే కూర్చోగా.. మరికొందరు సమీపంలో డాక్యుమెంటరీ రైటర్ల కార్యాలయాల మెట్లపై కూర్చున్నారు.



ఖేడ్‌లోని మీసేవ కేంద్రంలో ధ్రువపత్రాల కోసం వేచి ఉన్న ఆశావాహులు

రద్దీగా మీసేవ సెంటర్లు..

నారాయణఖేడ్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నారాయణఖేడ్ డివిజన్‌లో ఈనెల 3 నుంచి మూడోవిడత నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుండడంతో పోటీలో ఉండేందుకు ఆసక్తి ఉన్న వారు అవసరమైన కుల ధ్రువపత్రాల కోసం మీసేవ కేంద్రాల్లో మంగళవారం దరఖాస్తు చేసుకునేందుకు రావడంతో రద్దీ నెలకొంది. దీనికితోడు ఓటర్ల జాబితాతో పాటు ఇతర ధ్రువపత్రాల జిరాక్స్‌ల కోసం జిరాక్స్ సెంటర్లకు రావడంతో అక్కడా రద్దీ కనిపించింది.



గొటిగర్‌పల్లి గ్రామపంచాయతీ నామినేషన్ల పర్వంలో గిరి పుత్రులు

సంప్రదాయ దుస్తుల్లో నామినేషన్‌కు..

కోహీర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కోహీర్ మండలంలోని గొటిగర్‌పల్లి గ్రామంలో నామినేషన్ల స్వీకరణ కేంద్రానికి సిద్ధాపూర్, గోపినాయక్, సేడిగుట్టతండాలకు చెందిన గిరిజన మహిళలు తమ సంప్రదాయ దుస్తుల్లో మెరిశారు. నామినేషన్ దాఖలకు చేసేందుకు వచ్చిన అభ్యర్థితో నృత్యాలు చేసి సందడి చేశారు. సిద్ధాపూర్‌తండా, గొటిగర్‌పల్లి గ్రామాలు ఎస్టీ రిజర్వుడు కావడంతో తండాల నుంచి నామినేషన్లు దాఖలు చేసే అభ్యర్థులకు మద్దతుగా గిరిజనులు తరలివచ్చారు.

ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి

● గ్రామపంచాయతీ సాధారణ ఎన్నికల పరిశీలకులు భారతి లక్పతినాయక్



చిన్నశంకరంపేట ఎంపీపీ కార్యాలయంలో నామినేషన్ పత్రాలను పరిశీలిస్తున్న భారతి లక్పతినాయక్

చిన్నశంకరంపేట/చేగుంట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : సర్పంచ్, వార్డుల ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని గ్రామపంచాయతీ సాధారణ ఎన్నికల పరిశీలకులు భారతి లక్పతినాయక్ అన్నారు. చిన్నశంకరంపేట మండలంలోని రెండో దఫా ఎన్నికల నేపథ్యంలో మూడోరోజు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియలో భాగంగా మంగళవారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. నామినేషన్ల స్వీకరణ సరళిని, పత్రాలను పరిశీలించి మాట్లాడారు. సర్పంచ్, వార్డుల నామినేషన్లను స్వీకరించేందుకు పత్రాలను సరిచేసే విధంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారులు కృషిచేయాలని సూచించారు. చిన్నశంకరంపేట మండలంలోని పలు గ్రామాలకు చెందిన అభ్యర్థులు సర్పంచ్, వార్డులకు నామినేషన్లు దాఖలు చేశారు. ఆఖరిరోజు కావడంతో రాత్రి వరకూ నామినేషన్ కేంద్రాలు రద్దీగా మారాయి. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో దామోదర్, తహసీల్దార్ ప్రభుదాస్, ఎంపీవో గిరిజారాణి పాల్గొన్నారు. చేగుంట మండల పరిషత్ కార్యాలయం, ఎమ్మార్సీ భవన్‌లో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను గ్రామపంచాయతీ సాధారణ ఎన్నికల పరిశీలకులు భారతి లక్పతినాయక్ మంగళవారం పరిశీలించారు. ఆమె వెంట తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి, తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్, ఎంపీడీవో చిన్నారెడ్డి, తహసీల్దార్ శివప్రసాద్ ఉన్నారు.

గంట వ్యవధిలోనే సొంత గూటికి..!

● వర్గల్ మాజీ ఎంపీటీసీ భర్త విచిత్రం






ఇటు కాంగ్రెస్, అటు బీఆర్ఎస్ కండువా కప్పుకుంటున్న స్వామి

వర్గల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా వర్గల్ మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ మాజీ ఎంపీటీసీ బాగనోల్ల స్వాతి భర్త స్వామి మంగళవారం కాంగ్రెస్‌లో చేరారు. దీంతో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఇది జరిగిన గంట వ్యవధిలోని ఆయన తిరిగి సొంత గూడైన బీఆర్ఎస్‌లో చేరారు. దీంతో యూత్ విభాగం జిల్లా అధ్యక్షుడు దేవగనిక నాగరాజు బీఆర్ఎస్ జెండా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

సర్పంచ్ పదవికి వయస్సు అడ్డు కాదు

● నంగునూరు బరిలో 77 ఏళ్ల వృద్ధుడు



దేవులపల్లి చంద్రయ్య(ఫైల్)

నంగునూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : దేశానికి గ్రామాలే పట్టుగొమ్మలని ఆ గ్రామాలను పరిపాలించేందుకు వయసు అడ్డురాదని నిరూపించాడు ఓ వృద్ధుడు. ఎస్సీ రిజర్వుడు అయిన సిద్దిపేట జిల్లా నంగునూరు గ్రామపంచాయతీ అభ్యర్థిగా గ్రామానికి చెందిన దేవులపల్లి చంద్రయ్య(77) మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. ఒకపక్క యువత రాజకీయాల్లోకి రావాలని ఉవ్విల్లూరుతున్న సమయంలో నంగునూరుకు చెందిన వృద్ధుడు తానేం తక్కువ కాదని బరిలో నిలడుతున్నాడు.

విక్రయానికి ప్రచార సామగ్రి





నారాయణఖేడ్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి కొన్నిచోట్ల నామినేషన్ల ప్రక్రియ పూర్తికాగా.. మరికొన్నిచోట్ల ప్రారంభమైంది. దీంతో వ్యాపారులు అభ్యర్థుల అవసరాలకు అనుగుణంగా ప్రచార సామగ్రిని విక్రయానికి సిద్ధంగా ఉంచారు. వారివారి గుర్తుల జెండాలు, కండువాలు, డోర్ పోస్టర్లు, డమ్మి బ్యాలెట్ పేపర్లు, ప్రభుత్వానికి లెక్కలు సమర్పించేందుకు లెక్కల పుస్తకాలు, బ్యాడ్జీలు, ఓటర్ స్లిప్‌లు రెడీగా ఉంచారు. తమ పేర్లతో ప్రింటింగ్ చేయించుకునే వారికి గుర్తులతో కూడిన వాటిని తీసుకొచ్చి విక్రయానికి సిద్ధంగా ఉంచారు. సర్పంచ్ అభ్యర్థులతో పాటు వార్డు అభ్యర్థులకు ఎన్నికల అధికారులు కేటాయించే గుర్తులతో రెడీగా వీటిని అందుబాటులో ఉంచారు. అంతేకాకుండా జిరాక్స్ సెంటర్లలో గ్రామాలు, వార్డులవారీగా ఓటర్ల జాబితాలను అందుబాటులో ఉంచడంతో, పోటీలో ఉన్నవారు తమకు అవసరమైన సామగ్రిని కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. గుర్తులు పొందిన వారు వాటిని కొనుగోలు చేయగా, పొందని వారు గుర్తులు పొందిన అనంతరం కొనుగోలు చేయనున్నారు.



విక్రయానికి సిద్ధంగా ఉంచిన ఎన్నికల ప్రచార సామగ్రి

మటన్ బిర్యానీ రూ.150.. చాయ్‌కి రూ.10

● సర్పంచ్ ఎన్నికల ప్రచార ఖర్చులు ఇలా..

కోహెడ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో సర్పంచ్, వార్డుసభ్యుల పదవులకు పోటీ పడుతున్న అభ్యర్థుల ప్రచార ఖర్చుల ధరలను ఎన్నికల సంఘం నిర్ణయించింది. ప్రచార ఖర్చుల రోజువారీ వివరాలను ఎన్నికలు ముగిసిన 45 రోజుల్లోగా అధికారులకు అందించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఖర్చుల వివరాలను ఇంతకన్నా ఎక్కువ చూపితే అంగీకరించబోమని అధికారులు తెలిపారు. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు ప్రచారం కోసం సైకిల్ రిక్షా వినియోగిస్తే రోజుకు రూ.400, ఆటో రిక్షా అయితే రూ.1,500, టాటాఏస్ అయితే రూ.1,600గా నిర్ణయించారు. వెయ్యి పోస్టర్లకు రూ.5 వేలుగా ప్రకటించారు. నెత్తిన ధరించే టోపీకి రూ.40, టీషర్టుకు రూ.100 చెల్లించాలని పేర్కొన్నారు. ఒకరోజుకు కారు అద్దెను రూ.2,500గా, ఇన్నోవాకు రూ.3,500గా చూపాల్సి ఉంటుందన్నారు. కూర్చునేందుకు వినియోగించే ఒక్కో కుర్చీకి రోజుకు రూ.20గా, వీఐపీ కుర్చీ అయితే రూ.100 అద్దెగా నిర్ణయించారు. కూల్ డ్రింక్, వాటర్ బాటిల్‌కు రూ.20 చొప్పున, లస్సీకి రూ.35గా, వాటర్ ప్యాకెట్‌కు రూపాయి, టీకి రూ.10, కాఫీకి రూ.15 ధర చొప్పున లెక్క చూపాల్సి ఉంటుందని పేర్కొన్నారు. కిలో బరువున్న బాణసంచాకు రూ.800, ఒక డప్పుకు రూ.700 చెల్లించాలన్నారు. సాదా భోజనానికి రూ.80, మటన్ బిర్యానీకి రూ.150, చికెన్ బిర్యానీకి రూ.100 చొప్పున బిల్లు సమర్పించాల్సి ఉంటుందన్నారు.

అద్దె వద్దు.. కొత్తవి ముద్దు..

● వంట సామగ్రి కొనుగోలు చేస్తున్న అభ్యర్థులు

పటాన్‌చెరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికలు వచ్చాయంటే అభ్యర్థులను భయపెట్టేది పెట్టిన ఖర్చులకు లెక్క చూపించడం. ఈ విషయంలో అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికల సమయంలో ప్రచారానికి సహకరిస్తున్న వారికి భోజనాలు పెట్టడం సర్వసాధారణంగా మారింది. భోజనం వండాలంటే కావాల్సిన సామాన్లు అద్దెకు తీసుకునే సమయంలో డిమాండ్ ఎక్కువయింది. 10 రోజుల పాటు ఉండేటట్టు అద్దె ప్రాతిపదికన మాట్లాడుకుంటున్నారు. ఇందుకు అద్దెలు భారంగా మారి కొత్తవి కొనుగోలు చేసుకున్నారు. ఇందులో భాగంగానే అభ్యర్థులు కొత్తవి కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఎన్నికల్లో 10 రోజుల పాటు నిత్య భోజనాలు చేసిన తరువా చేతులు శుభ్రం చేసుకునే వాస్‌బేసిన్లను సైతం శాశ్వతంగా ఇనుము స్టాండ్లతో నిర్మించుకున్నారు.



నందిగామలో అభ్యర్థి విక్రమ్‌గౌడ్ మొబైల్ తరహాలో ఏర్పాటు చేసుకున్న మొబైల్ వాష్‌బేసిన్లు

ఎన్నికల కోసం పల్లెబాట

● గ్రామాల్లో తిష్టవేసిన పట్టణవాసులు ● వారిని, వారి కుటుంబాలను వింతగా చూస్తున్న ప్రజలు



గజ్వేల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పట్నానికి పరిమితమైన ఆయా గ్రామాల నాయకులు స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా పల్లెల ముఖం పట్టారు. కుటుంబాలతో సహా పల్లెలకు వచ్చి ఇక్కడే తిష్ట వేస్తున్నారు. కేవలం పండుగలకు, పబ్బాలకు వచ్చే నాయకులు కుటంబాలతో సహా రావడంతో గ్రామాల్లో సందడి నెలకొంది. గ్రామాల్లో ఏదైనా కష్ట, సుఖాలు ఉన్నప్పుడు గ్రామస్థులు రావాలని కోరితే కానీ రాని నాయకులు ప్రస్తుతం ఎన్నికల వేళ గ్రామాలకు రావడంతో గ్రామాల్లో కొత్త చర్చ తెరలేసింది. ఏ కార్యానికి పిలిచినా కుటుంబంతో సహా రానోళ్లు ఇప్పుడు ఇంటిల్లాదులు వచ్చి తిష్టవేశారు.. వాళ్ల అవసరమా లేక ప్రజలను బురిడీ కొట్టించి ఓట్లు దండుకుని మళ్లీ పట్నానికి చేరుకునే ఆలోచనా అని గుసుక్కుంటున్నారు. అంతేకాకుండా తమ అనుచరులను బరిలో నిలపడం, తామే బరిలో నిలవడం, వారి తరఫున ప్రచారం చేస్తుండడం, లేదా వారే కుటుంబంతో సహా ప్రచారం చేస్తుండడంతో ప్రజల నుంచి మిశ్రమ స్పందన వస్తుంది.

ఓట్లేసుకుని వెళ్లిపోతరేమో

పట్నం వచ్చిన నాయకులను, వారి కుటుంబాలను పల్లెల్లో ప్రజలు ఆసక్తిగా గమనిస్తున్నారు. ఓట్లని వచ్చిర్రు... ఓట్లవ్వగానే వెళ్లిపోతరు. మళ్లా పిలిచినా రారు.. పనులున్నాయని, చెప్పి తప్పించుకుంటరు. ఏదైనా పని ఉందని ఫోన్‌చేస్తే కూడా ఎత్తరు... ఇప్పుడు కాకా, అవ్వ అని మాట్లాడేటోళ్లే రేపు వీడికి ఏం పుట్టింది ఊరికే ఫోన్ చేస్తుండు అని తమ అనుచరులకు ఫోన్ చేసి మరీ కనుక్కుంటారని ఆయా రచ్చబండల వద్ద చర్చలు జరుగుతున్నాయి. పట్నం నుంచి వచ్చి పల్లెల్లో పోటీచేస్తున్న వారి పట్ల ప్రజల నుంచి అంతగా ఆశించిన స్పందన రావడం లేదని, గ్రామాల్లో ప్రజలను పట్టుకుని ఉన్న వాళ్ల పట్ల మాత్రమే ప్రజలు ఆసక్తిని కనబరుస్తున్నారని తెలుస్తుంది. మంచి, చెడు ఉన్నా ఊళ్లో ఉంటాడు.. ఏదైనా అయితే ఇంటికి వెళ్లి పని చేయించుకోవచ్చు. ఈ పట్నంలో ఉండెటోళ్లకు ఓటు వేసినా దండుగే అన్న భావన సగటు గ్రామ ప్రజల్లో వ్యక్తమవుతున్నది.

అభ్యర్థులకు తలనొప్పిగా మారిన వలసలు



ఖేడ్ నుంచి ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్తున్న గిరిజనులు

నారాయణఖేడ్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీ ఎన్నికల్లో పోటీచేస్తున్న అభ్యర్థులకు వలసలు తలనొప్పిగా మారాయి. నారాయణఖేడ్ నియోజకవర్గంలో ప్రతి సంవత్సరం చెరకు సీజన్‌లో గిరిజనులు 50 శాతం చక్కెర కర్మాగారాల వద్ద పని చేయడానికి కుటుంబసభ్యులతో కలిసి వలసలు వెళ్తారు. ప్రస్తుతం చక్కెర కర్మాగారాల్లో క్రషింగ్ ప్రారంభం కావడంతో, నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి ఎడ్లబండ్లపై గిరిజనులు కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారు. సంగారెడ్డి జిల్లాలో అత్యధికంగా గిరిజనులు నారాయణఖేడ్‌లో ఉన్నారు. నియోజకవర్గంలో 52 గిరిజన తండాలు ఉన్నాయి. సాధారణంగా ఖేడ్ ప్రాంతం నుంచి దాదాపు 50 వేల మంది శాశ్వతంగా హైదరాబాద్, ముంబయి, లాతూర్, సోలాపూర్, తదితర ప్రాంతాలకు వలసలు వెళ్తారు. దీనికితోడు సీజనల్ వలసలు వెళ్తుండడంతో ఎన్నికల వేళ వారి ఓట్లు వేయించుకునేందుకు వారిని స్వగ్రామాలకు తీసుకురావాల్సి ఉంటుంది. దీంతో పోటీలో ఉన్న వారు తమతమ గ్రామపంచాయతీ పరిధిలో ఎవరు.. ఏ ప్రాంతానికి వలస వెళ్లారనే విషయాలను సేకరించడం ప్రారంభించారు. గిరిజనులు దాదాపు 20 వేల మంది వరకు వలసలు వెళ్తారని, ఈ క్రమంలో నియోజకవర్గంలోని 226 గ్రామపంచాయతీల్లో ప్రతి పంచాయతీ నుంచి 200 మందికి తగ్గకుండా వలస వెళ్లారని, వారందరినీ ఎన్నికల రోజున ఓటు హక్కు వినియోగించుకోవడానికి తీసుకురావడం పోటీలో ఉన్న అభ్యర్థులకు తలనొప్పిగా మారనుందని అంటున్నారు.

సైబర్ మోసాలకు చెక్ పెడదాం



స్థానిక ఎన్నికల అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు

మెదక్ అర్బన్/పాపన్నపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : 'మీ భద్రత మీ చేతుల్లోనే.. ఆలోచించండి.. చెక్ చేసుకోండి.. సురక్షితంగా ఉండండి... సైబర్ మోసగాళ్లను దూరం పెట్టండి..' అని మెదక్ ఎస్పీ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మంగళవారం తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో ప్రారంభమైన ఫ్రాడ్ కా ఫుల్‌స్టాప్ పేరుతో 6 వారాల ప్రచార ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని రాష్ట్ర డీజీపీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారుల, విద్యార్థులు, సీనియర్ సిటిజన్స్ పాల్గొన్నారు. సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతిజ్ఞ, పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, డీఎస్పీలు సుభాష్ చంద్రబోస్, ప్రసన్నకుమార్, నరేందర్‌గౌడ్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హుస్సేన్, అధ్యాపకులు, విద్యార్థులు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు. అలాగే మెదక్ మండల పరిధిలోని మంబోజిపల్లి చెక్‌పోస్టును ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే.. కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. పాపన్నపేట మండల పరిధి కొత్తపల్లిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో స్థానిక సంస్థల ఎన్నికలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఎస్పీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నికల ప్రక్రియ, కోడ్‌ను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్, రూరల్ సీఐ జార్జ్, ఎస్బీ సీఐ సందీప్‌రెడ్డి, సీసీఎస్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, స్థానిక ఎస్ఐ సార శ్రీనివాస్‌గౌడ్, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ఎన్నికలు వద్దు

● బహిష్కరించిన తండావాసులు

● అధికారుల హామీతో నామినేషన్లకు అంగీకారం



ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న తండావాసులు

వట్‌పల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబోజిగూడ తండావాసులు తమ తండాలోని రెండు వార్డులకు జరగనున్న ఎన్నికలను బహిష్కరించగా, అధికారులు వారికి నచ్చజెప్పి నామినేషన్లు వేయించారు. వివరాలు.. వట్‌పల్లి గ్రామపంచాయతీలో కేవలం రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న అంబోజిగూడ తండాను ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న మంచిరాల తండా గ్రామ పంచాయతీలో కలిపారు. దీంతో మంచిరాల గ్రామ పంచాయతీ పరిధిలో 7,8 వార్డులుగా అంబోజిగూడ తండా విస్తరించింది. అయితే, ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ తండావాసులు పలుమార్లు అధికారులకు విన్నపాలు అందజేశారు. అయినా ఫలితం లేకపోయింది. దీంతో ఇటీవల నిర్వహించిన కులగణనలోనూ ఈ తండావాసులు పాల్గొనలేదు. ఈ క్రమంలో ఎన్నికలు రాగా, బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు ఎంపీడీవో సాయి తరుణ్‌కు వినతిపత్రం అందజేశారు. దీంతో ఎంపీడీవో, తహసీల్దార్ ఇతర అధికారులు తండాకు వెళ్లి మాట్లాడారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పి నామినేషన్లు వేసేందుకు ఒప్పించారు. కార్యక్రమంలో జోగిపేట సీఐ అనిల్‌కుమార్, ఎస్ఐ లవకుమార్ తదితరులు ఉన్నారు.

సంక్షిప్తం

బీసీ స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలోని బీసీ స్టడీ సర్కిల్‌లో ఉచితంగా ఐఈఎల్‌టీఎస్ శిక్షణ ఇవ్వనున్నట్టు డైరెక్టర్ ప్రవీణ్ తెలిపారు. విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు అవకాశాలను వివరించేందుకుగాను ఈ శిక్షణ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. డిగ్రీ పూర్తయిన అభ్యర్థులు ఈ నెల 21 వ తేదీ వరకు వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9949592991, 9494390803 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా బోడ లక్ష్మణ్



సంగారెడ్డి అర్బన్/నారాయణఖేడ్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): అఖిలభారతీయ విద్యార్థి పరిషత్ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా బోడ లక్ష్మణ్ ఎన్నికయ్యారు. ఏబీవీపీ 71వ జాతీయ మహాసభలు ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని డెహ్రాడూన్ పట్టణంలోని బిర్సాముండ నగర్‌లో నిర్వహించారు. దేశం వ్యాప్తంగా 1500 మంది ప్రతినిధులు పాల్గొన్న ఈ మహాసభలలో తనను జాతీయ కార్యవర్గ సభ్యుడిగా నియమించడం ఆనందంగా ఉందని లక్ష్మణ్ తెలిపారు.

పీడీఎస్‌యూ మహాసభలను జయప్రదం చేయండి

సంగారెడ్డి రూరల్ డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) జిల్లా 4వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సురేష్ పిలుపునిచ్చారు. సంగారెడ్డిలోని జిల్లా కార్యాలయంలో మంగళవారం మహాసభలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. పీడీఎస్‌యూ విద్యారంగ సమస్యలపై అలుపెరుగని పోరాటాలు చేస్తున్నదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లయినా విద్యారంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలను పరిష్కరించని ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు మహాసభల్లో చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సందీప్, నాయకులు శ్రీకాంత్, రుద్రాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కేజీకేఎస్ రాష్ట్ర కమిటీలో జిల్లా బాధ్యులకు చోటు

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ కల్లు గీత కార్మిక సంఘం (కేజీకేఎస్) రాష్ట్ర కమిటీలో జిల్లా కమిటీ బాధ్యులకు చోటు దక్కింది. సూర్యాపేటలో నిర్వహించిన కల్లుగీత కార్మిక సంఘం మహాసభలో జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్న ఆశన్నగౌడ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్న జంగన్నగౌడ్, జిల్లా కార్యదర్శిగా ఉన్న అంజాగౌడ్‌లను రాష్ట్ర కమిటీ సభ్యులుగా నియమించారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఉన్న రమేష్ గౌడ్‌కు రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కల్లు గీత కార్మిక సంఘంలో గత 25 యేళ్లుగా సేవలందిస్తున్న తమ సేవలను గుర్తించి రాష్ట్ర కమిటీలో చోటు ఇచ్చినందుకు రాష్ట్ర కమిటీ బాధ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

స్థానిక ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలుచుకోవాలి: బీజేపీ

నర్సాపూర్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ నియోజకవర్గంలో బీజేపీ మద్దతుతో బరిలో ఉన్న అభ్యర్థులు అత్యధిక స్థానాలు కైవసం చేసుకునేలా ప్రణాళికబద్ధంగా ప్రజల్లోకి వెళ్లాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వి.మల్లేశ్‌గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం నర్సాపూర్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలోని ముఖ్యనాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ మండలానికి ప్రత్యేకంగా ఇన్‌చార్జిని నియమించి వారి నేతృత్వంలో ఆయా మండలాల్లోని గ్రామాల్లో పార్టీ మద్దతుతో బరిలో ఉండేవారి గెలుపుకోసం సమష్టిగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నరమేష్‌గౌడ్, జిల్లా ఇన్‌చార్జి పెద్ద రమేష్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు నారాయణరెడ్డి, కోశాధికారి ఆంజనేయులుగౌడ్, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు గుండంశంకర్, పట్టణ అధ్యక్షుడు నీరుడి చంద్రయ్య, బుబ్బురి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభను విజయవంతం చేయాలి

వెల్దుర్తి, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): ఈనెల 7న మెదక్‌లో నిర్వహించే కార్మిక మహా ప్రదర్శన బహిరంగ సభను విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి గౌరీ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రమైన వెల్దుర్తిలో బహిరంగ సభకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కార్మిక, ఉద్యోగ హక్కుల పరిరక్షణ కోసం పోరాటాలు చేస్తున్న సీఐటీయూ రాష్ట్ర 5వ మహాసభలు ఈ నెల 7 నుంచి 9 వరకు మెదక్‌లో జరుగుతాయన్నారు. సభకు కార్మికులు, ఉద్యోగులు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు.

కంది సాగుపై అవగాహన

న్యాల్‌కల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి) మండలంలోని రాంతీర్థ్ గ్రామ శివారులో సాగు చేస్తున్న కంది పంట చేనును మంగళవారం బస్వంత్‌పూర్ ఏఆర్ఎస్ శాస్త్రవేత విజయ్ కుమార్, జహీరాబాద్ ఏడీఏ భిక్షపతి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు రైతులకు కంది పంట సాగులో మెళకువలు, సస్యరక్షణ చర్యలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఏవో అవినాష్, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ నిర్మించారు.. ప్రహరీ మరిచారు!

- బిలాల్‌పూర్‌లో రూ. రూ.58.50 లక్షల వ్యయంతో ఆసుపత్రి నిర్మాణం
- 2022లో పారంభించిన అప్పటి మంత్రి హరీశ్‌రావు
- మూడేళ్లుగా ప్రహరీ లేక ఆవరణలో రాత్రిపూట మందుబాబుల అడ్డా
- రోగులు, బంధువులకు ఇబ్బందులు



ప్రహరీ లేని బిలాల్‌పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

కోహీర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని బిలాల్‌పూర్ గ్రామంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రహరీ లేకపోవడం వల్ల ఆసుపత్రికి వచ్చే రోగులకు ఇబ్బందిగా మారింది. గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని లక్ష్యంతో రూ.58.50 లక్షల జాతీయ ఆరోగ్య సంస్థ, నియోజకవర్గ అభివృద్ధి, పల్లెప్రగతి నిధులతో బిలాల్‌పూర్ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించారు. 2022లో అప్పటి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు ఆసుపత్రిని ప్రారంభించారు. కాగా ఆస్పత్రిని నిర్మించి, వైద్య సిబ్బందిని నియమించినప్పటికీ ఆసుపత్రికి ప్రహరీని మాత్రం నిర్మించలేదు. దీంతో ఆసుపత్రికి వచ్చే రోగులకు ఆసుపత్రి బయట వేచి ఉండేందుకు కనీసం నీడ కూడా లేక ఇబ్బందులు పడుతున్నారు. అర కోటికి పైగా నిధులను వెచ్చించి ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించారు కానీ ఆసుపత్రి ఆవరణానికి ప్రహరీ నిర్మించకపోవడంపై రోగులు ప్రభుత్వంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఆసుపత్రికి ప్రహరీ లేకపోవడం వల్ల రాత్రివేళ మందుబాబులు ఆసుపత్రి ఆవరణంలో సిట్టింగ్‌లు చేసి మద్యం తాగడమే కాకుండా, సీసాలను పగులగొట్టి ఆసుపత్రి ఆవరణను ఛిద్రం చేస్తున్నారు. దీంతో ఆసుపత్రికి వచ్చే రోగులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ ఆస్పత్రికి ప్రహరీ నిర్మించాలని సంబంధితశాఖ మంత్రికి విన్నవించినా స్పందించడం లేదని పలువురు తెలిపారు. ఆసుపత్రికి ప్రహరీని నిర్మిస్తే ఆసుపత్రి ఆవరణలో మొక్కలను పెంచి గార్డెన్ ఏర్పాటు చేసుకుంటే ఆసుపత్రిని ఆహ్లాదకరంగా ఉంచేందుకు దోహదపడుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అంతే కాకుండా ఆసుపత్రిని సందర్శించే రోగులు, వారి బంధువులకు నీడ ఉంటుందంటున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి బిలాల్‌పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రహరీ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

సిర్గాపూర్‌లో ఘనంగా మల్లన్న స్వామి జాతర



మల్లన్నస్వామికి బోనాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

కల్హేర్/సిర్గాపూర్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సిర్గాపూర్‌లో అంగరంగ వైభవంగా మల్లన్న స్వామి జాతర ఉత్సవాల బోనాలను మంగళవారం ఊరేగించారు. అయిదు రోజుల పాటు జరిగిన మల్లన్నస్వామి ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా చివరి రోజున స్థానిక యాదవ సంఘం ఆధ్వర్యంలో బోనాల ఊరేగింపు ఘనంగా చేపట్టారు. పోతురాజుల విన్యాసాలు, శివ సత్తుల పూనకాలతో ఆద్యంతం బోనాల ఊరేగింపు భక్తులను ఆకట్టుకుంది. అనంతరం గ్రామ శివారులోని మల్లన్న స్వామి ఆలయంలో బోనాలను సమర్పించుకున్నారు.

మూడోవిడత నామినేషన్ల స్వీకరణకు కేంద్రాల్లో ఏర్పాట్ల పరిశీలన



కల్హేర్‌లో నామినేషన్ల ఏర్పాట్లు పరిశీలించి అధికారులకు సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

కల్హేర్/సిర్గాపూర్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మూడో విడతలో జరుగనున్న కల్హేర్, సిర్గాపూర్ మండలాల్లోని గ్రామ పంచాయితీల నామినేషన్లు, పోలింగ్ పకడ్బందీగా నిర్వహించాలని సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. కల్హేర్ ఎంపీపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ఎన్నికల అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం నామినేషన్ కౌంటర్ల వద్ద చేసిన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. అనంతరం సిర్గాపూర్ మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లో పోలింగ్ ఏర్పాట్లను అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ పరిశీలించారు.

ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు కృషి



నాగల్‌గిద్ద రైతువేదికలో నామినేషన్ కేంద్రంను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ ఉమా హారతి

నారాయణఖేడ్/మనూరు/నాగల్‌గిద్ద, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ డివిజన్‌లోని గ్రామాల్లో ఈ నెల 3 నుంచి మూడో విడత ఎన్నికల నిర్వహణకు అవసరమైన చర్యలను చేపట్టాలని సబ్ కలెక్టర్ ఉమా హారతి సూచించారు. మంగళవారం డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, పంచాయతీ కార్యదర్శులు, జీపీవోలతో ఖేడ్ పట్టణ శివార్లలోని కన్వెన్షన్ హాల్‌లో తహసీల్దార్లు, పంచాయతీ కార్యదర్శులు జీపీవోలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈనెల 3 నుంచి 5 వరకు నామినేషన్లు స్వీకరించనున్నట్టు తెలిపారు. సమావేశంలో తహసీల్దార్లు హసీనాబేగం, బాస్కర్, విష్ణుసాగర్, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు ఉన్నారు. అదేవిధంగా మనూరు మండలంలోని నామినేషన్ కేంద్రాలను, నాగల్‌గిద్దలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని సబ్ కలెక్టర్ పరిశీలించారు.

అసత్యప్రచారాలు చేస్తే కఠిన చర్యలు: డీఎస్పీ

మునిపల్లి: సర్పంచు ఎన్నికల సందర్భంగా ఎవరైనా ఫేక్ వార్తలు, అసత్య ప్రచారాలు చేస్తే, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సంగారెడ్డి డీఎస్పీ అన్నారు. సర్పంచు ఎన్నికల నేపథ్యంలో మునిపల్లి తోపాటు కంకోల్, బుదేరా (రైతు వేదిక)లోని నామినేషన్ సెంటర్లను ఆయన పరిశీలించారు. ఎన్నికల దృష్ట్యా మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 120మందికి పైగా ఎమ్మార్వో ముందు బైండ్ ఓవర్ చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా కేంద్రాలకు వచ్చే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట కొండాపూర్, మునిపల్లి సీఐ సుమన్‌కుమార్ ఉన్నారు.

నామినేషన్ కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు ఉండొద్దు



నర్సాపూర్‌లో నామినేషన్ల స్వీకరణ ఏర్పాట్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్, ఎంపీడీవో తదితరులు

నర్సాపూర్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా నర్సాపూర్ డివిజన్‌లో మూడో విడత ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో ఈ నెల 3 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానున్నది. మంగళవారం నామినేషన్ స్వీకరణ కేంద్రాల్లో ఏర్పాట్లను అదనపుకలెక్టర్ నగేష్, ఎంపీడీవో మధులతతో కలిసి పరిశీలించారు. నామినేషన్ల సందర్భంగా వచ్చేవారికి ఎటువంటి ఇబ్బందులు కల్గకుండా తగిన పోలీసుబందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు.

మాసాయిపేట, వెల్దుర్తి మండలాల్లో..

మాసాయి పేట/వెల్దుర్తి: మాసాయిపేట మండల కేంద్రంలో ఎన్నికల పోలింగ్ కేంద్రాలను మంగళవారం జడ్పీ సీఈవో ఎల్లయ్య తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి సందర్శించి పోలింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు, మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మూడు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అదేవిధంగా వెల్దుర్తి మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాలను జడ్పీ సీఈవో ఎల్లయ్య ఎరిశీలించారు. రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో నామినేషన్ల ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అలాగే తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి నామినేషన్ల ప్రక్రియ కౌంటర్ల ఏర్పాట్లను పరిశీలించారు.

ప్రచారాలకు అనుమతి తప్పనిసరి

పెద్దశంకరంపేట: మండలంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులు తమ ప్రచారం, పబ్లిక్ మీటింగ్‌లు, ర్యాలీలు, మైకుల వినియోగానికి సంబంధించి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. అభ్యర్థులు ఈ విషయాన్ని గమనించాలని తెలిపారు.

వైభవంగా దత్త చండీయాగం



బర్దీపూర్ దత్తగిరి ఆశ్రమంలో హోమం నిర్వహిస్తున్న భక్తులు

ఝరాసంగం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి) ఝరాసంగం మండల పరిధిలోని బర్దీపూర్ దత్తగిరి ఆశ్రమంలో మంగళవారం దత్తజయంతి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం గణపతి, పుణ్యాహవాచనం, రుత్విక్ వరణం,మహామంగళహారతి కార్యక్రమాలు కొనసాగాయి. 21 యజ్ఞ గుండాలలో దంపతులతో వైదిక మంత్రాల మధ్య ప్రత్యేక హోమాలు జరిగాయి. కార్యక్రమానికి కర్ణాటక, మహారాష్ట్రల నుంచి భక్తులు భారీగా తరలి వచ్చారు. కార్యక్రమంలో ఆశ్రమ పీఠాధిపతి అవధూతగిరి మహారాజ్, డాక్టర్ సిద్ధేశ్వర నందగిరి మహారాజ్ పాల్గొన్నారు.

దానధర్మాలతో పుణ్యం

రేగోడు డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): సంపాదనలో కొంత భాగాన్ని దానధర్మాలు చేయడం వల్ల పుణ్యం కలుగుతుందని గొట్టిముక్కల దత్తాత్రేయ ఆశ్రమ వ్యవస్థాపకులు నారాయణ మహారాజ్ పేర్కొన్నారు. దత్త జయంతి సందర్భంగా మంగళవారం పెద్ద శంకరంపేట మండలంలోని గొట్టిముక్కల శివారులో దత్తాత్రేయ ఆశ్రమంలో ఉత్సవాలు ప్రారంభించినట్టు తెలిపారు. బుధవారం భజన, ప్రత్యేక పూజలు. 4న గణపతి పూజ, దత్తాత్రేయ స్వామివారికి అభిషేకం, ధ్వజారోపణ, డోలారోహణం కార్యక్రమాలు ఉంటాయన్నారు.

వైద్య సేవలు అందించేందుకు సిద్ధంగా ఉండాలి



నార్సింగి పీహెచ్‌సీలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో శ్రీరామ్

చిన్నశంకరంపేట/చేగుంట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో వైద్య సేవలు అందించేందుకు సిబ్బంది సమాయత్తం కావాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీరామ్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన చిన్నశంకరంపేట, చేగుంట, నార్సింగి మండలాల్లో ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మందుల స్టోర్ రూం, ల్యాబ్ రూమ్‌లను, ఆసుపత్రికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికలు జరిగే ప్రాంతంలో వైద్య సేవలు అందించేందుకు సిద్ధంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. ప్రతీ పోలింగ్ బూత్ వద్ద మెడిసిన్ అందుబాటులో ఉంచి వైద్య సేవలందించాలని సిబ్బందికి సూచించారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఆయా కార్యక్రమాల్లో వైద్యాధికారులు డాక్టర్ వైశాలి, అనిల్‌కుమార్, రవికుమార్, రేణుక, సూపరింటెండెంట్ యాదగిరిరావు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

వైభవంగా మహా పడిపూజ



మహాపడిపూజలో ఎంపీ రఘునందన్‌రావు

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలోని ఓడీఎఫ్ కాలనీలో రాము సాహితీ గురుస్వామి ఆధ్వర్యంలో నారికేళ అయ్యప్పస్వామి మహా పడిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శబరిమలకు పాదయాత్రగా మూడుసార్లు వెళ్లిన సందర్భంగా తన స్వగృహంలో 18 వ మహాపడిపూజను అంగరంగ వైభవంగా జరిపించారు. మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, టీజీఐఐసీ చైర్‌పర్సన్‌నిర్మలజగ్గారెడ్డి, శ్రీజ్యోతిర్వాస్తు విద్యాపీఠం వ్యవస్థాపకులు మహేశ్వరశర్మ సిద్ధాంతి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గురుస్వాములు జయప్రకాశ్, శ్రీశైలం గౌడ్, మోహన్‌రావు, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



గోకుల్‌నగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ మెట్టుకుమార్‌యాదవ్

పటాన్‌చెరు డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాలనీల్లో సమస్యలు పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ మెట్టుకుమార్‌యాదవ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం పటాన్‌చెరు డివిజన్ పరిధి శాంతినగర్, శ్రీనగర్, గోకుల్‌నగర్ కాలనీల్లో పర్యటించారు. స్థానికులు మురుగు లీకేజీ సమస్యలు అధికంగా ఉన్నాయంటూ ఫిర్యాదు చేశారు. రెండు రోజుల్లో సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఆయనతో పాటు అంజిరెడ్డి, రవి, అజ్మత్, వెంకటేష్, సాయియి, సంతోష్‌లున్నారు. అనంతరం విద్యాభారతి పాఠశాలలో నిర్వహించిన గీతాజయంతి వేడుకలో పాల్గొన్నారు. ఉపాధ్యాయులకు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో శ్రీజ, దామోదర్‌రెడ్డి, రవి తదితరులు ఉన్నారు.

న్యాయ చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



భరోసా కేంద్రంలో బాధితులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న న్యాయాధికారి సౌజన్య

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): న్యాయ చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని న్యాయాధికారి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య తెలిపారు. సంగారెడ్డిలోని భరోసా కేంద్రంలో మంగళవారం బాధితులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు సంబంధించిన కేసులను త్వరితగతిన పరిష్కరించేలా కృషి చేయాలన్నారు. బాధితులు ఎలాంటి న్యాయ సహాయం కోరినా వారికి ఉచితంగా సమస్యలు పరిష్కరించుకునేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. పోక్సో గృహహింస, వరకట్న చట్టాల మీద ప్రత్యేక అవగాహన కల్పించారు. అనంతరం భరోసా కేంద్రాన్ని సందర్శించి బాధితులకు అందిస్తున్న సేవలపై ఆరా తీవారు. సదస్సులో భరోసా కేంద్రం సిబ్బంది, బాధితులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలందించిన వైద్యసిబ్బందికి ప్రశంసాపత్రాలు



ఉత్తమ సిబ్బందిని అభినందిస్తున్న మెదక్ జిల్లా జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ సునీతదేవి

మెదక్ , కల్చరల్, డిసెంబర్ 2 (ఆంధ్రజ్యోతి) వరల్డ్ ఎయిడ్స్ డే కార్యక్రమాన్ని జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలందించిన జిల్లా జనరల్ ఆస్పత్రి మెదక్‌లో పని చేస్తున్న సిబ్బందికి డీఎంహెచ్‌ఓ డాక్టర్ ధనసరి శ్రీరామ్ ప్రశంసాపత్రాలు అందజేశారు. వీరి సేవలను జిల్లా జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అల్లంకి సునీత దేవి అభినందించారు. కార్యక్రమంలో డెర్మటాలజీ ప్రొఫెసర్ డాక్టర్ విజయ శేఖర్, మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ కోమల్, ఈఎన్‌టీ ప్రొఫెసర్ డాక్టర్ రవి శంకర్, డాక్టర్ కిరణ్, ఐసీటీసీ కౌన్సిలర్ కే గోపి, పీపీటీసీ కౌన్సిలర్ సుధాకర్, డీఎస్ఆర్‌సీ కౌన్సిలర్ రాజేశ్వర్, స్టాఫ్‌నర్స్ సౌందర్య, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీకాంత్ పాల్గొన్నారు

ఎయిడ్స్ మహమ్మారిని తరిమేయాలి

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ మహమ్మారిని తరిమేయాలని సంగారెడ్డిలోని తారా కళాశాల ప్రిన్సిపాల్ ప్రవీణ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని తారా కళాశాలలోని ఎన్ఎస్ఎస్ విభాగాలు, సామాజిక శాస్త్ర విభాగం, జీవశాస్త్ర విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రవీణ మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధికి మందు లేదని, నివారణ ఒక్కటే మార్గమన్నారు. కార్యక్రమంలో అధికారులు జగదీశ్వర్, జ్యోత్స్న, డా.అనిత, వల్లిసౌభాగ్యం, అనురాధ పాల్గొన్నారు.

పరిశ్రమల సహకారంతో గ్రామాల అభివృద్ధి

పటాన్‌చెరు డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామికవేత్తల భాగస్వామ్యంతో గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. తెల్లాపూర్ పురపాలక పరిధి ముత్తంగి గ్రామంలో శాండ్విక్ పరిశ్రమ సౌజన్యంతో రూ.3కోట్ల అంచనా వ్యయంతో ఆర్‌వో వాటర్ ఏటీఎం కేంద్రం, బయోకంపోస్ట్ కేంద్రం, అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాలలపై ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్ పలకలు, సోలార్ విద్యుత్, వీధి దీపాలు, ఎలక్ట్రిక్ చెత్త సేకరణ ఆటోలు, రూ.2.10కోట్లతో నిర్మించతలపెట్టిన సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు శ్రీనివాస్‌రెడ్డి, ఉపేందర్, శాండ్విక్ పరిశ్రమ ప్రతినిధి సీఎస్ఆర్‌రెడ్డి రవి ఆరోరా, కమిషనర్ అజయ్‌కుమార్‌రెడ్డి, మండల ప్రజాపరిషత్తు మాజీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ కుట్రలను కొనసాగనివ్వం: పద్మారెడ్డి

రామాయంపేట, డిసెంబర్ 2(ఆంధ్రజ్యోతి): రామయంపేట ఉమ్మడి మండలంలో బీఆర్ఎస్ క్యాడర్ పటిష్ఠంగా ఉన్నందున జీర్ణించుకోని కాంగ్రెస్ తమ అభ్యర్థులను అయోమయానికి గురిచేస్తుందని మెదక్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మారెడ్డి ఆరోపించారు. మంగళవారం నిజాంపేటకు చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త శ్రీకాంత్‌గౌడ్ బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా రామాయంపేటకు వచ్చిన పద్మారెడ్డి అతడికి కండువా వేసి పార్టీలోకి స్వాగతించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. ప్రస్తుతం స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రలోభాలకు గురి చేస్తూ.. అనేక హామీలతో జనాన్ని మోసగించే ప్రయత్నం చేస్తుందన్నారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా.. కాంగ్రెస్ కుట్రలను కొనసాగనివ్వబోమని పద్మారెడ్డి హెచ్చరించారు.

బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థుల విజయానికి కృషి

జహీరాబాద్ రూరల్, న్యాల్‌కల్ డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి) స్థానిక పంచాయితీ ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పని చేసి బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు సూచించారు. మంగళవారం ఝరాసంగం, న్యాల్‌కల్ మండలంలోని హుస్సేన్ నగర్ గ్రామాలకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరగా ఎమ్మెల్యే మాణిక్ రావు, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హామీలు నెరవేర్చని కాంగ్రెస్‌కు ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధిచెప్పాలన్నారు.

జిల్లాలో కాంగ్రెస్ బలోపేతానికి కృషి



డీసీసీ అధ్యక్షుడిగా నియామక పత్రం అందుకుంటున్న ఆంజనేయులుగౌడ్

నర్సాపూర్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): అందరి సహకారంతో మెదక్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసి తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దేందుకు తనవంతు కృషి చేస్తానని డీసీసీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం గాంధీభవన్‌లో పీసీసీ ఇన్‌ఛార్జి మీనాక్షినటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ల ద్వారా డీసీసీ అధ్యక్షుడిగా ఆంజనేయులుగౌడ్ నియామకపత్రం అందుకున్నారు. తనపై నమ్మకంతో మరోసారి అవకాశం కల్పించినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు ముఖ్య నాయకులందరికి ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మెదక్ జిల్లాలో కాంగ్రెస్‌కు గ్రామాల్లో బలమైన క్యాడర్ ఉందని, కార్యకర్తలు, నాయకులందరి సమన్వయంతో పార్టీని మరింత బలోపేతం చేస్తానన్నారు. ప్రస్తుత సర్పంచ్ ఎన్నికల్లో తమ పార్టీ మద్దతుతో బరిలో ఉన్న వారిని అత్యధికంగా గెలిపించుకుని జిల్లాలో కాంగ్రెస్ సత్తా చాటుతామన్నారు.

ఓటర్.. క్వార్టర్..!

(7వ పేజీ తరువాయి)

బెల్ట్‌షాపుల నిర్వహణకు వేలం వేసి మరీ నడిపిస్తున్నారంటే అతిశయోక్తి కాదు. ఇంతకాలం బెల్ట్‌షాపులకు గుట్టుగా మద్యం సరఫరా జరగగా, ఇప్పుడు ఆటోలు, బైక్‌లపై దిగుమతి చేస్తున్నారు.. ఈ విషయం ఎక్సైజ్ అధికారులకు తెలిసిందే అయినా పెద్దగా చర్యలు కనిపించడం లేదు. వైన్స్ షాపుల్లో ఫోకస్ ఉన్నా బెల్ట్ షాపులపై దృష్టి సారించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం నామినేషన్ల దశలోనే మద్యం ఏరులై పారుతుండగా, పోలింగ్ వరకు పరిస్థితి మూడు క్వార్టర్లు.. ఆరు ఫుల్ బాటిళ్లు అన్నట్లుగా మారుతుందని భావిస్తున్నారు.

నామినేషన్ బారులు

(7వ పేజీ తరువాయి)

కీలక ఘట్టం అయిన నామినేషన్ల ఉపసంహరణ జరగనుంది. నేటితో ఎవరు ఎన్నికల బరిలో నిలుస్తారో.. ఎవరు తప్పుకుంటారు అనేది తేలనుంది. స్థానిక రాజకీయ నేతలు కొందరి అభ్యర్థులను పోటీ నుంచి తప్పుకోవాలని ఒప్పించే ప్రయత్నాలు చేశారు. రేగోడ్ మండలంలో కాంగ్రెస్ నేతలు తమ రెబల్స్‌ను ఒప్పించేందుకు రాష్ట్ర మంత్రి వద్దకు వెళ్లడంతో రాజకీయం ఒక్కసారి వేడెక్కింది. కొన్ని గ్రామాల్లో అభ్యర్థులపై తీవ్ర ఒత్తిడి తీసుకొస్తుండడంతో ఉద్రిక్తతలు నెలకొన్నాయి. నామినేషన్ల ఉపసంహరణల తర్వాతే ఏకగ్రీవమయ్యే స్థానాల లెక్క తేలనుంది.